సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం ; 14 ; మార్చి ; 2025



బెటాలియన్ అభివృద్ధికి కృషి

పదో బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తానని అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 5-02 (శనివారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.7 /18.8

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శాంతియుతంగా హోలీ జరుపుకోవాలి

గద్వాల క్రైం: హోలీ పండుగను జిల్లా ప్రజలు శాంతియుత వాతావరణంలో.. ప్రకృతిలో లభించే, చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించని సహజ రంగులను వినియోగించి ఆనందోత్సాహాల నడుమ హోలీ పండుగ జరుపుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం, గుర్తు తెలియని వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై రంగులు లేదా రంగు నీటిని చల్లడం నిషేధించామని, గుంపులుగా తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఎక్కడైన బలవంతంగా రంగులు వేసినట్లు ఫిర్యాదుల వస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. చెరువులు, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, జిల్లా ప్రజలందరు సంతోషంగా రంగుల పండుగను జరుపుకోవాలని, ప్రజలకు హోలీ శుభాకంక్షాలు తెలిపారు.

పెద్దచింతరేవుల హుండీ ఆదాయం రూ.9.38లక్షలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గిరిరావు తెలిపారు. జిల్లా పరిశీలకురాలు వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు నిర్వహించగా.. మొత్తం రూ.9.38లక్షల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. గతేడాది రూ.9.67 లక్షల ఆదాయం రాగా.. ఈ సారి రూ.29వేలు ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారిణి కవిత, ఆలయ అర్చకులు కిష్టాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఒక నెల రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు టీజీబీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాములు ప్రకటనలో తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమానికి బీసీ అభ్యర్థులు, డిగ్రీ పూర్తయిన 26సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారు అర్హులని, www.tgbcstudycircle.cgg.gov.in వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తారని తెలిపారు. ఈటెస్ట్‌లో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేసి ప్రైవేటు బ్యాంకులలో ప్లేస్మెంట్ కల్పిస్తారని, పూర్తి వివరాలకు 040293031301, 9985434941 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



అలంపూర్: ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం అలంపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగులకు రుణాల ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపాలిటీలోని దివ్యాంగులకు రుణాల నిమిత్తం ఒక యూనిట్ మంజూరైనట్లు ఆయన తెలిపారు. యూనిట్ విలువ రూ.50 వేలు అని, 22 మంది దివ్యాంగులు ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ నర్గిస్, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, నర్మద, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,419

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 1,376 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6419, కనిష్టం రూ.3619, సరాసరి రూ.5280 ధరలు పలికాయి. అలాగే, 37 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.6889, కనిష్టం రూ. 6159, సరాసరి రూ. 6529 ధరలు వచ్చాయి. 13 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5979, కనిష్టం రూ. 3019, సరాసరి రూ. 5979 ధరలు లభించాయి.

అగ్గితో జాగ్రత్త

వేసవి ఎండల నేపథ్యంలో అప్రమత్తతే ఆయుధం



ఉండవెల్లిలో దగ్ధమైన గడ్డివాములు (ఫైల్)

- గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములు, గుడిసెలకు పొంచి ఉన్న ముప్పు
- నిబంధనలకు నీళ్లు వదులుతున్న పరిశ్రమలు, ఆస్పత్రుల యాజమాన్యాలు
- అవగాహనతోనే ప్రమాదాలకు చెక్

ఉండవెల్లి: వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. ఏమాత్రం పొరపాటు చేసినా అది మనకు ఎంతో ప్రమాదం కలుగజేస్తుంది. వంట గది, పంట చేన్లు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, విద్యాలయాలు, ఆఫీస్‌లు, పెట్రోలు బంకులు, సినిమాహాళ్లు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలు స్థలమేదైనా అప్రమత్తంగా ఉండాల్సిందే. జిల్లాలో గతంలో జరిగిన అగ్నిప్రమాదాలతో రోడ్డునపడ్డ కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. గతేడాది అలంపూర్ నియోజకవర్గంలో 80 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రానున్న రెండు నెలల్లో అగ్ని ప్రమాదాల జరగకుండా అప్రమత్తంగా ఉండాలని.. ఒకవేళ జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినా కొన్ని జాగ్రత్తలైన ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేసుకోవడంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం అధికంగా జరగకుండా నివారించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు వివరిస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు..

నియోజకవర్గంలోని చాలా వరకు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఫంక్షన్‌హాళ్లు, పరిశ్రమలు, భారీ భవనాల యజమానులు నిబంధనల ప్రకారం అగ్నిప్రమాద నివారణ పరికరాలు అమర్చుకోవడం లేదు. అలంపూర్, అయిజ, వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, రాజోలి, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లో అనేక ప్రైవేటు పాఠశాలలు, డిగ్రీ, ఇంటర్ కళాశాలలు, చిన్నా, పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. వీటన్నింటికి అగ్నిమాపకశాఖ అనుమతి తప్పనిసరి కాగా చాలామంది అనుమతి లేకుండానే కొనసాగిస్తున్నట్లు సమాచారం. అగ్నిప్రమాదాల నివారణకు ప్రస్తుతం అనేక ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. పొగ, నిప్పు,ను గుర్తించగానే హెచ్చరించే పరికరాలు లభిస్తున్నాయి. వీటిని, ఇళ్లు, కార్యాలయాలు, పరిశ్రమల్లో, పెట్రోల్ బంకుల్లో అమర్చుకోవాలని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.

ఇలాంటివి దూరంగా ఉంచాలి

ఇళ్లలో చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు అందుబాటులో ఉంచొద్దు. కాలిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పడవేయొద్దు. ఐఎస్ఐ ఎలక్ట్రిక్ మెయిన్ ఆఫ్ చెయ్యాలి. గ్యాస్ రెగ్యులేటర్ వాల్ ఆపివేయాలి. పాఠశాలలో, అపార్టుమెంట్‌లలో ఫైర్‌స్మోక్ డిటెక్టర్లు అమర్చుకోవాలి. గతంలో పంట పొలాల్లో గడ్డి వాములు అధికంగా దగ్ధం అయ్యాయి. గడ్డి వాములను ఇంటి పక్కల కాకుండా దూరంగా ఉంచుకోవాలి. ఒక్క ఉండవెల్లిలోనే గతేడాది ఎనిమిది గడ్డివాములు దగ్ధమై, రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

గడ్డివాములు దగ్ధమయ్యాయి..



గతేడాది వేసవిలో పొలంలో గడ్డివాము నిల్వ చేశాం. పగటి ఉష్ణోగ్రతలు పెరగడం వల్లనో ఏమో మధ్యాహ్నం ఇంటికి వెళ్లి వచ్చేసరికి గడ్డివాములు మొత్తం దగ్ధమయ్యాయి. కొన్ని రోజులపాటు పశువులకు మేత కరువైంది. ఒక్కో గడ్డివాము రూ.14వేలు పెట్టి కొనుగోలు చేశాం.

– గోద జయన్న, ఉండవెల్లి

అవగాహన కల్పిస్తున్నాం

ఇళ్లు, విద్యాసంస్థలు, గోదాములు, పెట్రోల్ బంకులు, పరిశ్రమల్లో వేసవిలో అగ్ని ప్రమాదాలు నియంత్రించే సాధనాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలను చైతన్య వంతులను చేయడానికి అవగాహన కార్యక్రమాలు, మాక్‌డ్రిల్స్ చేపడుతున్నాం. గతంతో పోల్చితే ప్రమాదాలు బాగా తగ్గాయి.

– కురుమూర్తి, ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్, అలంపూర్ చౌరస్తా



రైస్‌మిల్లుల్లో అవగాహన కల్పిస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

వెంటనే సాగునీటిని విడుదల చేయండి



కొండాపురం శివారులో వాడుముఖం పట్టిన వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, జిల్లా అధికారులు

- కలెక్టర్ బీఎం సంతోష్
- ర్యాలంపాడు ప్రధాన కాల్వ, ఎండిన పంటల పరిశీలన

కేటీదొడ్డి: ర్యాలంపాడు ప్రధాన కాల్వకు తక్షణం సాగునీటిని విడుదల చేయాలని, నీటి సరఫరా సమర్థవంతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కేటీదొడ్డి మండలంలోని కొండాపురం, గువ్వలదిన్నె గ్రామంలోని నీటి కొరతతో ఎండుతున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సరఫరా లేక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాలంపాడు ఎడమ ప్రధాన కాలువ 104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, మైలగడ్డ గ్రామాల వద్ద కాలువ ప్రవాహన్ని నీటి సరఫరా పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. కాలువలో నీటి విడుదల పంపిణీ విధానం, ఆయకట్టు పరిదిలోని ప్రాంతాలకు నీరు చేరుతున్న తీరును తెలుసుకునేందుకు అక్కడి పంపింగ్ స్టేషన్లు పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడి రైతుల సూచనల మేరకు తక్షణమే సాగునీటిని కాల్వలకు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కాల్వల వెంట నీటి వినియోగాన్ని సమతుల్యంగా నిర్వహించే విధంగా చూడాలని, నీటి ప్రవాహం చివరి ఆయకట్టు వరకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడు మద్దతుగా ఉంటుందని వారి పంటలను కాపాడేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకొని సాగునీటి సరఫరా పద్ధతులను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ రైతులకు వివరించారు. కలెక్టర్ వెంట వెంట ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, వ్యవసాయ అధికారి సక్రియానాయక్, ఏడీఏ సంగీత లక్ష్మీ, విద్యుత్ శాఖ ఎడి రమేష్‌బాబు, ఏఓ సజీద్‌రెహమ్మన్, ఏఈఓ ప్రీయాంక, సంబందిత అధికారులు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు

గద్వాల: గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు వృత్తినైపుణ్యాలను పెంపొందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు కోసం జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గంలో మూడు ఎకరాల స్థలం గుర్తించడం జరిగిందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ నిర్వహించిన జూమ్‌మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారం లోగా నివేదిస్తామన్నారు. మీటింగ్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



గద్వాలలో పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

గద్వాలటౌన్: చెత్త, ఇతర వ్యర్థాలను రోడ్ల పక్కన ఇష్టానుసారంగా చెత్త పారవేస్తారో అలాంటి వారిని గుర్తించి జరిమానా విధించాలని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రంలో కలియ తిరిగారు. ఆయా వార్డులలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పట్టణంలోని దుకాణాలు, హోటళ్లు, వైన్స్ షాపుల దగ్గర పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని, వారికి హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా ఉందని మండిపడ్డారు. పారిశుద్ధ్య నిర్వహణ పాటించని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛ గద్వాల లక్ష్యంగా పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగుపరిచి, పట్టణ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దశరథ్, శానిటరి ఇన్స్‌పెక్టర్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలి

కేటీదొడ్డి: ఎన్డీఏ ప్రభుత్వం ఎంఎస్‌పీ చట్టం, రుణ విముక్తితోపాటు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసి నూతన జాతీయ మార్కెటింగ్ ముసాయిదాను రద్దు చేయాలని రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపుమేరకు గురువారం కేటీదొడ్డిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ వ్యవసాయ రంగానికి నిధుల్లో కోత విధించిందని, ఎరువుల సబ్సిడీని తగ్గించి, ధరల స్థిరీకరణ నిధి పెంచలేదని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో గోవిందు, మల్లయ్య, నర్సింహులు, గోపాల్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



గద్వాలటౌన్: గెలుపు ఓటముల కంటే పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి (డీవైఎస్ఓ) జితేందర్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల కోసం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. గురువారం స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అండర్ -14, 16, 18, 20 విభాగాలలో బాలురు, బాలికలకు వేరువేరుగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంతో పాటు జావలిన్ త్రో విభాగాలలో క్రీడాకారులు పోటీపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 150మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. డీవైఎస్ఓ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఎంపికైన వారందరూ ఈ నెల 23వ తేదీలలో హైదరాబాద్‌లోని కొల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసన్న, సతీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు నగేష్‌బాబు, విజయ్, అమరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ



దేవునిగుట్ట వద్ద ఏర్పాటు చేసిన పునరావాస ప్రాంతంలో కొనసాగుతున్న పనులు

ఆర్అండ్ఆర్ అధోగతి

- పాలమూరు- రంగారెడ్డి నిర్మాణంలో తీవ్రమైన ఆటుపోట్లు
- ఉదండాపూర్ రిజర్వాయర్ పనులకు అంతరాయం
- అభివృద్ధి పనులకు రూ.800 కోట్ల పైనే నిధుల అవసరం
- ముందుకు సాగని పునరావాసం.. ఆందోళనలో నిర్వాసితులు
- తాజా ప్రభుత్వం నిర్ణయంపైనే బాధితుల ఆశలు

ఉదండాపూర్ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 15.91 టీఎంసీలు	సాగునీరు అందించే లక్ష్యం 9.36 లక్షల ఎకరాలు
వెచ్చిస్తున్న నిధులు రూ.6,616 కోట్లు	
ముంపునకు గురవుతున్న గ్రామాలు, తండాలు 7	
సేకరించిన భూమి 4,585 ఎకరాలు (ఉదండాపూర్ 1,207 ఎకరాలు, వల్లూరు 1,290 ఎకరాలు, పోలేపల్లి 308, ఖానాపూర్ 760, కారుకొండ 561, కిష్టాపూర్, సిద్దోటం, తీగలపల్లి గ్రామాల్లో మరో 459 ఎకరాలు)	
నిర్వాసిత కుటుంబాలు 2,075	

జడ్చర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. పథకంలో భాగంగా జడ్చర్ల మండలంలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి కాకపోవడంతో పాటు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ అమలు చేయక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం త్వరితగతిన పనులు పూర్తి చేసి రిజర్వాయర్‌ను వరద జలాలు నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఉదండాపూర్ ప్రాజెక్టు పనులతో పాటు నిర్వాసిత సమస్యలపై నీలినీడలు అలుముకున్నాయి. దీంతో ఉదండాపూర్ ప్రాజెక్టు పనులు, ఆర్అండ్ఆర్ అమలుపై తాజా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నిలిచిపోయిన రిజర్వాయర్ నిర్మాణ పనులను పునఃప్రారంభం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ముంపులో 2 గ్రామాలు, 5 తండాలు

ఉదండాపూర్ రిజర్వాయర్‌లో రెండు గ్రామాలతో పాటు ఐదు గిరిజన తండాలు ముంపునకు గురవుతున్నాయి. ఇందులో జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్, వల్లూరుతో పాటు తుమ్మలకుంటతండా, రేగడిపట్టతండా, చిన్నగుట్టతండా, ఒంటిగుడిసెతండా, నవాబ్‌పేట మండలం తీగలపల్లి పంచాయతీ పరిధిలోని సామగడ్డతండాలు మునగనున్నాయి. ఉదండాపూర్‌కు సంబంధించి 1,039 నిర్మాణాలు ముంపునకు గురవుతుండగా 1,34,844 చ.గజాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. తద్వారా 1,350 కుటుంబాలు నిరాశ్రయులుగా మారా యి. అలాగే వల్లూరులో 358 నిర్మాణాలు ముంపునకు గురవుతుండగా 63,457 చ.గ. భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ 605 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. తుమ్మలకుంటతండాలో 84 నిర్మాణాలు మునగనుండగా 12,550 చ.గ. భూమిని స్వాధీనం చేసుకోవడంతో 120 కుటుంబాలు నిర్వాసితులుగా మిగిలారు.

ఒకే దగ్గర పునరావాసం

ముంపునకు గురవుతున్న గ్రామాలు, తండాల వారికి ఒకే దగ్గర పునరావసం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం జడ్చర్ల, పోలేపల్లి శివారులోని దేవునిగుట్టతండా వద్ద పునరావాస ప్రక్రియ పనులు మొదలుపెట్టారు. మొత్తం 316 ఎకరాల భూమిని గుర్తించగా.. ఇందులో 76 ఎకరాలు పట్టాదారుల నుంచి సేకరించగా 240 ఎకరాల ప్రభుత్వ భూమిని పునరావాసానికి కేటాయించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.171.55 కోట్లను కేటాయించింది. అయితే వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు సంబంధించి సరిహద్దులను గుర్తించి ప్లాట్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కులాలు, మతాల వారీగా ప్లాట్లు కేటాయిస్తారా.. అనేది ఆయా గ్రామస్తుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతానికి పునరావాస కేంద్రంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సరఫరా, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్అండ్ఆర్, ఇతర అభివృద్ధి పనులకు మరో అదనంగా రూ.800 కోట్లు అవసరమవుతాయి.



ముంపునకు గురవుతున్న వల్లూరు గ్రామం

తక్కువ పరిహారం

రిజర్వాయర్ పరిధిలో సేకరించిన భూములకు ప్రభుత్వం అతి తక్కువ పరిహారం చెల్లించింది. ఇక్కడ ఎకరాకు రూ.5.50 లక్షలు, సాగునీటి వసరులున్న భూమి ఎకరాకు రూ.6.50 లక్షలు మాత్రమే పరిహారంగా చెల్లించింది. పోలేపల్లి శివారులోని భూములకు ఎకరాకు రూ.12 లక్షలు కేటాయించారు. ఒకే రిజర్వాయర్ పరిధిలో ఉన్న భూములకు కేటాయించిన ధరల్లో తారతమ్యం చూపడంపై నిర్వాసితులు మండిపడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.30- 50 లక్షలకు పైగానే ధరలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. మానవతా దృక్పథంతో తమకు అదనంగా పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం..

ఆర్అండ్ఆర్ (రీ హాబిటేషన్, రీ సెటిల్‌మెంట్) ప్యాకేజీకి సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి విడతలో తండాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.16.30 లక్షలు, సింగిల్‌గా ఉన్న వారికి రూ.6.30 లక్షల చొప్పున రూ.42 కోట్లు విడుదల చేశారు. తాజాగా మరో రూ.71 కోట్లను ప్రభుత్వం కలెక్టర్ ఖాతాలో జమచేసింది. అయితే ఆర్అండ్ఆర్ ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఆర్అండ్ఆర్ పెంపుతో పాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉదండాపూర్‌కు చెందిన నిర్వాసితులు రిలేదీక్షలు చేపట్టారు. కాగా.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమ తరుపున ఆందోళనలు చేపట్టిన అనిరుధ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలువడంతో తమకు న్యాయం జరుగుతుందని నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు.

రూపాయి సాయం అందలేదు..



ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తాము సంతకాలు చేశాం. తమ బ్యాంకు ఖాతాలలో మూడు దఫాలుగా పరిహారాన్ని జమ చేస్తామని అధికారులు అప్పట్లో చెప్పారు. ఇప్పటి వరకు రూపాయి జమ చేయలేదు. రోజురోజుకు మార్కెట్ విలువ పెరిగిపోతుంది. ప్రస్తుతం ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచి ఇవ్వాలి.

– రామాంజనేయులు, నిర్వాసితుడు, ఉదండాపూర్


నిధులు విడుదల కావాలి



ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి ఆర్అండ్ఆర్ అమలు పెండింగ్‌లో ఉంది. గిరిజన తండాలకు అవార్డ్ పాస్ కావడంతో రూ.42 కోట్లు నిర్వాసితుల ఖాతాలలో జమయ్యాయి. వల్లూరు, ఉదండాపూర్ ముంపు గ్రామాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి అవార్డ్ సిద్ధం చేయాల్సి ఉంది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాలతో అక్కడక్కడా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ముందుకు వెళుతున్నాం.

– నర్సింగరావు, తహసీల్దార్, జడ్చర్ల

పదవీ త్యాగానికి సిద్ధం



ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతా. అవసరం అనుకుంటే పార్టీని, పదవిని పక్కన పెట్టి నిర్వాసితుల తరపున నిలబడుతా. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి నుంచి న్యాయం చేస్తామన్న హామీ దక్కింది. అవార్డు పాసైన తండాలకు ఆర్అండ్ఆర్ పరిహారంతో పాటు ప్లాట్లు త్వరలోనే అందజేస్తాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

క్లుప్తంగా

రైతు ఆత్మహత్యాయత్నం

గట్టు: మండలంలోని మిట్టదొడ్డికి చెందిన రైతు మారెప్ప గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి యత్నించారు. భార్య సరోజమ్మ కథనం మేరకు.. మారెప్పకు గ్రామ శివారులో పొలం ఉండగా, పక్కనే గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ నర్సింహారెడ్డి, నల్లారెడ్డి, కిష్టారెడ్డి వ్యవసాయ భూములున్నాయి. రెండు పొలాల మధ్య నక్ష బాట ఉండగా.. సదరు వ్యక్తులు బాటను ఆక్రమించే ప్రయత్నం చేశారు. బాట ఆక్రమణపై గతంలో రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల, జిల్లా సర్వే అధికారులు వచ్చి సర్వే చేసినా ఆక్రమించుకునేందుకు యత్నిస్తే అడ్డుకోగా తమపై అట్రాసిటీ కేసు నమోదు చేయించడంతో పాటు దాడిచేసి గాయపర్చినట్లు వివరించారు. దీంతో మానసిక వేదనకు గురై తన భర్త గడ్డి మందు తాగాడని తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించామని, పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు సరోజమ్మ చెప్పారు.

యువకుడి బలవన్మరణం


మధు (ఫైల్)

ఉండవెల్లి: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉండవెల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ అశోక్ వివరాల మేరకు.. మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన గొల్ల మధు (21) కర్నూలులో జరిగిన వివాహానికి వెళ్లి.. స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఉండవెల్లి శివారులో గుర్తుతెలియని రైలు వస్తుండగా.. రైల్వే బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికిగల కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రాజు (ఫైల్)

చిన్నచింతకుంట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన చిన్నచింతకుంట మండలం పర్దీపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాంలాల్ నాయక్ వివరాల మేరకు.. పర్దీపూర్‌కు చెందిన కుమ్మరి రాజు (31) స్వగ్రామం నుంచి లాల్‌కోటకు బైక్‌పై వెళ్తుండగా.. జల్మానాయక్ తండాకు చెందిన రమేష్ నాయక్ అతివేగంగా బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. రమేష్ నాయక్‌కు స్వల్పగాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేనత్త ఖాతా నుంచి రూ.24లక్షలు మాయం

బ్యాంకు ఖాతాలో నుంచి దశల వారీగా కాజేసిన అల్లుడు

మహబూబ్‌నగర్ క్రైం: చదువురాని ఆమె అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని.. బ్యాంకు ఖాతాకు అతని ఫోన్ నంబర్ యూపీఐ లింక్ ఏర్పాటు చేసుకున్నాడు.. జల్సాలకు అలవాటు పడి, ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతూ సొంత మేనత్త ఖాతాలో ఉన్న డబ్బులను ఆమెకు తెలియకుండా కాజేశాడు ఓ ప్రబుద్ధుడు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. హన్వాడ మండలం గొండ్యాల్ గ్రామానికి చెందిన జయమ్మకు ఉన్న అర ఎకరం భూమి విక్రయించి వచ్చిన డబ్బులను గతేడాదిలో జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ బ్యాంకులో రూ.28 లక్షలు దాచుకుంది. ఈ క్రమంలో బ్యాంకులో డబ్బులు పెట్టడానికి వెళ్లిన సందర్భంగా ఆమెకు చదువు రాకపోవడంతో సహాయంగా ఉంటాడని సొంత అన్న కొడుకు అయిన బాలానగర్ మండలం ఉడిత్యాలకు చెందిన చాకలి నాగరాజును తీసుకెళ్లింది. ఈ క్రమంలో బ్యాంకు ఖాతాకు అవసరమైన ఫోన్ నంబర్ నాగరాజుది ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో ఆ ఖాతాకు సంబంధించిన యూపీఐ లింక్‌ను నాగరాజు ఫోన్ పేటీఎం, ఫోన్ పే ఏర్పాటు చేసుకుని.. నిత్యం పేటీఎం, ఫోన్‌పే ద్వారా డబ్బులు వాడుకోవడం మొదలుపెట్టాడు. జల్సాలు చేయడం, ఆన్‌లైన్ పలు రకాల గేమ్స్ ఆడుతూ ఖాతాలో నుంచి రూ.25 లక్షలు కాజేశాడు. ఇటీవల జయమ్మ డబ్బులు అవసరం ఉండి బ్యాంకుకు వెళ్లగా బ్యాంకు సిబ్బంది ఖాతాలో నుంచి డబ్బులు బాగానే డ్రా చేస్తున్నావ్ మళ్లీ బ్యాంకుకు ఎందుకు వచ్చావని అడిగారు. దీంతో షాక్ గురైన జయమ్మ నేను ఖాతాలో నుంచి డబ్బులు తీయలేదని అధికారులకు చెప్పింది. దీంతో బ్యాంకు అధికారులు ఆమె ఖాతాకు సంబంధించిన స్టేట్‌మెంట్ తీసి ఇవ్వగా మోసపోయినట్లు గ్రహించింది. ఈ విషయమై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అందుబాటులోకి రాని సేవలు


రెస్క్యూ బృంద సభ్యులకు సూచనలు చేస్తున్న అధికారులు

- హైడ్రాలిక్ పవర్డ్ రోబో యంత్రానికి అవరోధం
- అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో సాంకేతిక సమస్యలు
- 30 గంటలు గడిచినా వివరాలు వెల్లడించని అధికారులు
- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగం వద్ద సమీక్ష నిర్వహిస్తున్న అరవింద్‌కుమార్

అచ్చంపేట: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే టన్నెల్ చివరి 40 మీటర్ల వద్ద ప్రమాదకర స్థలంలో సహాయక చర్యల కోసం తీసుకొచ్చిన రోబోల సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. బుధవారం అన్వి రోబోటిక్ సంస్థకు చెందిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోను టన్నెల్ లోపలికి పంపించారు. కానీ, గురువారం సాయంత్రం వరకు 30 గంటలు గడిచినా ప్రమాద స్థలంలో రోబో పనితనం మొదలుకాలేదు. ఇప్పటి వరకు హైడ్రాలిక్ పవర్ రోబో లోపల ఏం చేస్తుందో అధికారులు వివరించలేదు. అత్యంత ప్రమాదకరమైన డీ- 1, 2 ప్రదేశాలకు చేరుకోవడం ఎంతో క్లిష్టమైన పరిస్థితులు నెలకొన్నాయి. రోబోకు అవసరమైన సాంకేతిక లోపాలు ఎదరవుతున్నాయి. మొత్తం మూడు స్టేజీల్లో తవ్వకాలు చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం రెస్క్యూ బృందాలు మొదటి స్టేజీలోని శిథిలాలు, మట్టి, బురద, ఇనుప రాడ్లు, రాళ్ల తొలగిస్తున్నారు. సహాయక చర్యలు ఇలాగే కొనసాగితే మరో నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు రెస్క్యూ బృందాలు పేర్కొంటున్నాయి. టీబీఎం మిషన్ ఉన్న ప్రాంతానికి మినీ జేసీబీ వెళ్తుండటంతో సహాయక చర్యల్లో కొంత పురోగతి కనిపిస్తోంది. 200 మంది రెస్క్యూ బృందాలను తగ్గించి ఎక్కువగా సింగరేణి కార్మికులతో శ్రమిస్తున్నారు. సొరంగంలో దుర్వాసన కూడా తగ్గినట్లు సహాయక సిబ్బంది చెబుతున్నారు. పేరుకుపోయిన బురద, రాళ్ల తొలగిస్తూ దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ గ్యాస్ కట్టర్‌తో టీబీఎం విడి భాగాలను కట్ చేస్తూ లోపలి నుంచి బయటికి తెస్తున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు తీసిన శిథిలాలను బయటికి తీసుకొచ్చారు. సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో భూగర్భ పరిస్థితులను తెలుసుకునేందుకు జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) ప్రతినిధుల బృందం తొమ్మిది రోజుల వ్యవధిలో 200 మీటర్ల వరకు మాత్రమే సర్వే చేయగలిగారు. మరో 250 మీటర్లు సర్వే చేస్తే తప్ప సొరంగం పైభాగం కూలడానికి గల కారణాలు తెలియవు. టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిలో ఒకరి మృతదేహం బయటికి తీసుకురాగా, మిగతా ఏడుగురి కోసం సర్వశక్తులు వడ్డుతున్నారు. అత్యున్నత సాంకేతికను వాడుతూ ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, రాడర్ హోల్ మైనర్స్ వంటి 12 బృందాలు 20 రోజులుగా నిరంతరం శ్రమిస్తూ వారి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. రెండు రోజుల నుంచి కన్వేయర్ బెల్టుకు సరిపడా మెటీరియల్ లేక పనిచేయడం లేదు. మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

మరోసారి డాగ్స్ సాయం

సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కనుగొనేందుకు డీ- 1, 2 వద్ద సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు తవ్వకాలు చేపడుతున్నారు. డీ-2 వద్ద కేరళకు చెందిన కాడవర్ డాగ్స్ పసిగట్టిన ప్రదేశంలో నాలుగు రోజులుగా తవ్వకాలు జరిపారు. ఇక్కడ టీబీఎం మిషన్‌కు చెందిన రాడ్లు, బేస్, శిథిలాలు కనిపించడంతో గురువారం వాటిని బయటికి తీసుకువచ్చారు. అక్కడ మిగతా ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో మరోసారి డాగ్స్‌ను లోపలికి తీసుకెళ్లారు. అవి పసిగట్టే ప్రదేశాల్లో మరోసారి తవ్వకాలు చేపట్టి కార్మికుల ఆచూకీ గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.


సహాయక సిబ్బందితో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నేడు మరో రెండు రోబోలు

టన్నెల్ చివర ప్రమాదకరమైన 40 మీటర్ల వద్ద రెస్క్యూ బృందాల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రోబో యంత్రాల ద్వారా సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు నాలుగు రోజులుగా నిపుణుల బృందం రంగంలోకి దిగింది. మొదట ఏ-1 అత్యాధునిక టెక్నాలజీ కలిగిన కెమెరాలతో టన్నెల్ లోపలికి వెళ్లారు. గురువారం అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో లోకో ట్రెన్ ద్వారా లోపలికి పంపించారు. కానీ, ఇప్పటి వరకు వాటి సేవలు అందుబాటులోకి రాలేదు. శుక్రవారం మరో రెండు రోబోలు వస్తాయని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇవి ఒక్కొక్కటి ఒక రకమైన సేవలకు ఉపయోగిస్తారు.

భోజన ఏర్పాట్లపై ఆరా

దోమలపెంట: ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సింగరేణి, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్, ఇతర సిబ్బంది, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం చేస్తున్న భోజన ఏర్పాట్లపై కలెక్టర్ బదావత్ సంతోష్ ఆరాతీశారు. గురువారం కలెక్టర్ రెస్క్యూ బృందాల సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి భోజనం ఎలా ఉంది.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భోజనాలు వడ్డించే వారిని సైతం పలకరించి.. అందరికీ కడుపు నిండా భోజనం వడ్డించాలని సూచించారు.

వైభవం.. ధ్వజారోహణం


అలివేలుమంగమ్మ ఆలయ ఆవరణలో ధ్వజారోహణం చేస్తున్న చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్


ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న పండితులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీఅలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానం సమీపంలోని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి.. మట్టి తీసుకువచ్చారు. అనంతరం దేవస్థానం వద్ద ఉన్న మండపంలో పురోహితుల వేదమంత్రాల మధ్య హోమం నిర్వహించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజల అనంతరం ధ్వజారోహణం, అమ్మవారి సన్నిధిలో దేవతా ఆహ్వానం, బలిహరణం, ఎదుర్కోలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారికి హనుమత్ వాహన సేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి అమ్మవారికి హనుమత్ వాహన సేవ వైభవంగా జరిగింది. శోభాయమానంగా అలంకరించిన హనుమత్ వాహనంపై అమ్మవారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తుల హరినామస్మరణ మార్మోగింది. వివిధ రకాల పూలు, బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుకల్యాణ మహోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది హోలీ పండుగ రోజు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా దేవస్థానం వద్ద తిరుకల్యాణ వేడుకకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కొనసాగుతున్న రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

అడ్డాకుల: మండలంలోని కందూరులో స్వయంభుగా వెలసిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమ పండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రధాన ఆలయంలోని శివలింగానికి గవ్యాంత పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నిత్యార్చన, నిత్యోపాసన, రుద్రహోమం, నిత్య బలిహరణ, నిరాజన మంత్రపుష్పాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా గౌరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, రుద్రహోమాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత స్వామివారికి రథోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి అనంతసేన్‌శర్మ, అర్చకులు మణికంఠ శర్మ, రేవంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

హోలీ.. ఆనంద కేళి


గంగాపురంలో కాముడి దహనం

జడ్చర్ల టౌన్: వసంతకాలంలో దేశవ్యాప్తంగా జరుపుకొనే హోలీ వేడుకలను శుక్రవారం ఆనందోత్సవాలతో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. హోలీ వేడుకల కోసం పట్టణాల్లో రంగుల విక్రయకేంద్రాలు ఏర్పాటు చేశారు. రంగులతో పాటు వాటర్ గన్‌లు విక్రయిస్తున్నారు. పలుచోట్ల రంగుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. అయితే హోలీ వేడుకలు, కామ దహనానికి సంబంధించి ఆధ్యాత్మికంగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. మన్మథుడు అనే కామదేవుడిని శివుడు అగ్నికి ఆహుతిచ్చిన రోజుగా వాడుకలో ఉంది. అయితే రతిదేవి ప్రార్థనకు చలించిన శివుడు.. కామదేవుడిని భౌతికంగా బతికించకుండా ప్రేమరూపంలో ప్రతి ఒక్కరి మనసులో ఉండేలా వరమిచ్చాడు. అందుకు చిహ్నంగా ప్రతి ఏటా వసంతకాలం పౌర్ణమి రోజున కామదహనం చేస్తుంటాం. మరుసటి రోజు వసంతకాలంలో చెట్లు చిగురించినట్టుగా ప్రతి ఒక్కరిలో ప్రేమ చిగురించాలని రంగురంగులతో వసంతోత్సవం ఆడటం ఆనవాయితీగా వస్తోంది.

కాముడి దహనం..

పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాత్రి జడ్చర్ల పట్టణంతో పాటు గ్రామాల్లో కాముడి దహన వేడుకలు నిర్వహించారు. కాముడి బొమ్మను ఊరేగించి ముఖ్య కూడళ్లలో దహనం చేశారు.

గంగాపురంలో ఒకరోజు ముందుగానే..

రాష్ట్రంలో పేరుగాంచిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల్లో ఒకటైన గంగాపురంలో ఒకరోజు ముందుగానే అంటే బుధవారం రాత్రి కాముడి దహనం నిర్వహించారు. పూర్వీకుల నుంచి ఈ ఆనవాయితీ వస్తోంది. ప్రతి ఏటా వసంత త్రయోదశి రోజునే కాముడి దహనం వేడుక జరుపుతున్నారు. అందులో భాగంగా బుధవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో వడ్రంగి ఇంటికి చేరుకుని అక్కడ కాముడి బొమ్మను తీసుకుని సేవా మండపం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్కడ పూజలు చేసి దహనం చేశారు. కాముడి దహనం ముందుగా ఎందుకు చేస్తారనే దానికి ఎలాంటి శాస్త్రీయత లేదు.

కేఎల్ఐ కాల్వలో పడి వృద్ధురాలి మృతి

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్ సమీపంలో గురువారం రాత్రి కేఎల్ఐ కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కంచన్‌పల్లికి చెందిన పెంటమ్మ (80) వాడ్యాల్‌లో ఉన్న తన కూతురు వరలక్ష్మి ఇంటికి వెళ్లింది. రాత్రి వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో గ్రామస్తుల సహకారంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా.. గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాల్వ వద్ద చెప్పులు, టవల్ కన్పించాయి. అనుమానంతో కాల్వలో గాలింపు చేపట్టగా.. మృతదేహం లభ్యమైంది.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

గద్వాల క్రైం: కులం పేరుతో దూషించి విచక్షణ రహితంగా కర్రలతో ప్రవేటు ఉద్యోగిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. ఈ నెల 11న గంజిపేటకు చెందిన రాములు ప్రైవేటు ఫైనాన్స్‌లో విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో కలెక్టరేట్ సమీపంలో గద్వాలకు చెందిన విక్రమ్‌సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దారి అడ్డగించి కులం పేరు తో దూషించి కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. గురువారం ఇద్దరిని అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పదో బెటాలియన్ అభివృద్ధికి కృషి


- అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం


పదో పటాలంలో చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ తదితరులు

ఎర్రవల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ సిబ్బందికి అవసరమైన పూర్తి వసతులు అందించి బెటాలియన్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని తెలంగాణ స్పెషల్ పోలీస్ అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ అన్నారు. గురువారం స్థానిక పదో బెటాలియన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు, పటాలం కమాండెంట్ సాంబయ్యతో కలిసి నూతన చిల్డ్రన్స్ పార్క్, పరేడ్ గ్రౌండ్ గ్యాలరీలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం కమాండెంట్ కార్యాలయంలో సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పటాలం అభివృద్ధితోపాటు సిబ్బందికి అందుతున్న వివిధ సంక్షేమ పథకాల గురించి కమాండెంట్‌తో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో బెటాలియన్ పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. విధి నిర్వహణలో పటాలం సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి పటాలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పటాలంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, పాణి, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, రాజారావు, రాజేష్, రమేష్‌బాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అదనపు డీజీపీకి ఎస్పీ శ్రీనివాసరావు ఎర్రవల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి స్వాగతం పలికారు.

నవ వధువు ఆత్మహత్య

- వరకట్న వేధింపులతో మనస్థాపం
- ఉరేసుకుని బలవన్మరణం


సుజాత(ఫైల్)

కొందుర్గు: కాళ్ల పారాణి ఆరక ముందే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని వెంకిర్యాలలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం ఎన్కెపల్లికి చెందిన కప్పరి మణ్యం, సుగుణమ్మల కూతురు సుజాత(21)ను మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం లింగంపల్లికి చెందిన రాములుకు ఇచ్చి గత నెల 7న వివాహం జరిపించారు. ఈ సమయంలో వరకట్నం కింద అర తులం బంగారు ఆభరణాలు, స్కూటీ కొనుక్కునేందుకు రూ.70 వేల నగదుతో పాటు వంట సామాగ్రి అందజేశారు. అయితే పెళ్లి జరిగిన రోజు నుంచి భర్త రాములుతో పాటు మామ పోచయ్య, బావ సైదులు మానసికంగా బాధపెడుతున్నారు. పెళ్లికి రూ.6 లక్షలు ఖర్చు అయిందని, ఈ మొత్తాన్ని మీ తల్లిదండ్రుల నుంచి తేవాలని సుజాతను ఒత్తిడి చేస్తున్నారు. ఇదిలా ఉండగా మణ్యం, సుగుణమ్మ వెంకిర్యాలలోని తమ సమీప బంధువు రామకృష్ణకు చెందిన టీ స్టాల్‌లో పని చేస్తూ ఇక్కడే ఉంటున్నారు. గురువారం వెంకిర్యాలకు వచ్చిన సుజాత రాత్రి వేళ వద్ద బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మణ్యం ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రమేశ్ కుమార్ సమక్షంలో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బాలస్వామి తెలిపారు. ఇదిలా ఉండగా సుజాత అంత్యక్రియలను అత్తగారి గ్రామమైన లింగంపల్లిలో నిర్వహించారు.

ఎస్ఎల్‌బీసీ ఘటన దురదృష్టకరం

- 8 మంది కార్మికుల మృతి ప్రభుత్వ నిర్లక్ష్యమే..
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యకుడు డా.గడ్డం లక్ష్మణ్


సొరంగం వద్ద డా. లక్ష్మణ్ బృందం

అమ్రాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాద ఘటన దురదృష్టకరమని.. 8 మంది కార్మికుల ప్రాణాలు గాలిలో కలవడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం ఎస్ఎల్‌బీసీని పౌరహక్కుల సంఘం, కుల నిర్మూలన వ్యతిరేక పోరాట సమితి బృందంతో కలిసి సందర్శించారు. రెస్క్యూ బృందం, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో మాట్లాడి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలు వేగవంతంగా ఉన్నాయని.. సొరంగంలో ప్రమాదం జరగకముందే పరిస్థితిని పసిగట్టి ఉంటే ప్రాణ నష్టం జరిగేది కాదన్నారు. గత ప్రభుత్వం 2019లో ఇన్‌లెట్ వన్ వద్ద పనులు ఎందుకు నిలిపివేసిందో ప్రస్తుత ప్రభుత్వానికి విషయం చెప్పలేదా అని ప్రశ్నించారు. నేటికీ ఏడుగురు కార్మికుల ఆచూకీ లభించకపోవడంతో ఆయా కుటుంబాల ఆవేదన వర్ణనాతీతమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి, జేపీ కంపెనీ మరో రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కులనిర్మూలన వ్యతిరేక సమితి రాష్ట్ర సభ్యుడు లక్ష్మీనారాయణ, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు పి.బాలయ్య, జె.బాలయ్య, ఎన్.లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వందోసారి తిరుమలకు కాలినడక


రంజిత్ కుమార్‌రెడ్డి

మక్తల్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తారు భక్తులు. కొందరు అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. ఇదే కోవకు చెందిన మక్తల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రంజిత్‌కుమార్‌రెడ్డి ఏకంగా వందసార్లు అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లి భక్తిభావం చాటుకున్నారు. గురువారం వందోసారి తిరుమలకు కాలినడకన వెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రతినెలా అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

8 వాహనాలు సీజ్



మానవపాడు: పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సైదానాయక్ తెలిపారు. గురువారం మండలంలోని శివారు ప్రాంతంలో ఆర్‌టీఏ అధికారులు ముమ్మరంగా తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి ఎక్కువగా వెళ్తున్న 8వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చంద్రశేఖర్‌గౌడ్, హోమ్‌గార్డు ఖాదర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల వైద్యుడి మృతి

గద్వాల: ధరూరు మండలం గార్లపాడు గ్రామానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల సర్జన్ డాక్టర్ పి.సర్వేశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో గురువారం హైదరాబాదులో మృతి చెందాడు. ఈయన నీలోఫర్ ఆసుపత్రి చిన్న పిల్లల సర్జన్‌గా, ఉస్మానియా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆస్పత్రులలో వైద్యసేవలందించారు. అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం గార్లపాడులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పాగపుల్లారెడ్డికి అల్లుడు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు విషాదవదనంలో మునిగిపోయారు.

ధరూరులో డ్రంకెన్ డ్రైవ్ కేసులు



ధరూరు: చింతరేవులలో నిర్వహించిన తనిఖీలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, దాని వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. మండల పరిధిలోని చింతరేవులలో డ్యాం వెళ్లే రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇటిక్యాల: మండలంలోని చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి, శనగపల్లి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కేవీ, చాగాపురంలో 33 కేవీ కొత్తఫీడర్ ఏర్పాటు కోసం ఆయా గ్రామాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు, ప్రజలు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

డీజిల్ దొంగతనం: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని అమర్‌నాథ్ రెడ్డి కౌలుకు తీసుకున్న పొలంలో గురువారం తెల్లవారుజామున నీళ్లు కడుతుండగా, అతని ట్రాక్టర్‌లో డిజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తుండగా అరుపులు, కేకలు వేశాడు. దీంతో దొంగలు పరారయ్యారు. అమర్‌నాథ్‌రెడ్డి గురువారం పోలీసుల ఫిర్యాదు చేయడంతో దొంగలు తెచ్చుకున్న డిజిల్ డబ్బాలు, పైపులు, ఇతర వస్తువులను పోలీసులు గుర్తించారు. దుండగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

జీహెచ్‌ఎంకు సన్మానం



ఇటిక్యాల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు పదోన్నతిపై వచ్చిన నూతన జీహెచ్‌ఎం పాగుంటన్నను గురువారం ఉపాధ్యాయులు పూలమాలు వేసి శాలువాతో సత్కరించారు. గతంలో ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి, తిరిగి అదే పాఠశాలకు జీహెచ్‌ఎంగా రావడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభాస్కర్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, బీచుపల్లి, రేణుక, సురేఖ, రంగారెడ్డి, రఘు, రాఘవేంద్ర, బీసన్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

రాజోళి: రేవంత్ సర్కారు నియంతల పాలనను తలపిస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పచ్చర్ల శ్రీనువాసులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం అప్రజాస్వామ్యమన్నారు. ప్రజా సమస్యలపై గొంతు విప్పితే సస్పెండ్ చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

- సెగ్రిగేషన్ షెడ్ల వినియోగమేది
- కనపడని కంపోస్టు ఎరువు తయారీ
- షెడ్లలో చెత్త రీసైక్లింగ్ ఊసేలేదు
- ప్రతి జీపీలో రూ.2.5లక్షలతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం



బుడ్డారెడ్డిపల్లిలో ప్రారంభం కాని ఎరువు తయారీ



పెద్దదిన్నెలో తయారైన నాణ్యత లేని ఎరువు

ఎర్రవల్లి: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం చేపట్టింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పంట పొలాలకు అవసరమయ్యే కంపోస్ట్ ఎరువులను తయారీ చేయడం కోసం ప్రభుత్వం ప్రతి జీపీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి సేకరించిన చెత్తా చెదారం గ్రామాల శివార్లలో, రోడ్ల పక్కన ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. పంచాయతీల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం లక్షలు ఖర్చు పెట్టినా అవి ప్రజలకు సక్రమంగా ఉపయోగపడటం లేదు.

ప్రతి జీపీకి రూ.2.5లక్షలు..

ప్రభుత్వం పంచాయతీల్లో ప్రజలకు కావలిసిన అన్ని సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి జీపీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2.5 లక్షలు కేటాయించింది. సెగ్రిగేషన్ సెడ్‌ను నిర్మించి గ్రామం నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించింది. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీలకు సమకూర్చుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం సగానికి పైగా జీపీల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వానపాములు సకాలంలో రాకపోవడంతో ఎరువు తయారీ పనులు నేటికీ ప్రారంభం కాలేదు.

నాణ్యతలేని కంపోస్టు ఎరువు..

నియోజకవర్గంలోని 124 జీపీలకు గాను 88 షెడ్లలో మాత్రమే ప్రస్తుతం వానపాములతో సేకరించిన చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారుచేస్తున్నారు. వాటిలో కూడా ఎరువు సక్రమంగా తయారు కావడం లేదు. అందులో తడి, పొడి చెత్తను వేయకుండా ఎక్కువ మొత్తంలో కేవలం మట్టిని మాత్రమే వేయడం వల్ల వానపాములు చనిపోతున్నాయి. దీనివల్ల కంపోస్టు ఎరువు సక్రమంగా తయారు కాకపోవడం వల్ల రైతులు దానిపై మొగ్గుచూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. మిగిలిన 36 షెడ్లలో కూడా ఇప్పటి వరకు వానపాములు అందుబాటులోకి రాలేదు. దీనివల్ల కంపోస్టు ఎరువును తయారు చేసే ఊసే లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఆయా మండలాల వారీగా..

మండలం	జీపీలు	ఉపయోగంలో ఉన్నవి	నిరుపయోగంలో ఉన్నవి
ఇటిక్యాల	29	21	8
మానవపాడు	16	12	4
అలంపూర్	14	9	5
ఉండవెల్లి	16	13	3
రాజోళి	11	8	3
వడ్డేపల్లి	10	6	4
అయిజ	28	19	9

కంపోస్టు ఎరువుపై ఆసక్తి చూపడం లేదు



గ్రామాల్లో జీపీ సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు. కంపోస్టు ఎరువు తయారీకి అది సక్రమంగా పనికిరావడం లేదు. షెడ్లలో వానపాములకు తగిన ఆహారం అందకపోవడంతో అవి చనిపోతు న్నాయి. అందువల్ల సెగ్రిగేషన్ షెడ్లలో వానపాములను ఉపయోగించి తయారు చేస్తున్న కంపోస్టు ఎరువు నాణ్యతగా ఉండడం లేదు. దీనివల్ల నాణ్యతలేని కంపోస్టు ఎరువును విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

– తెలుగు వీరేష్, ఎర్రవల్లి

వందశాతం పనులు పూర్తి..



ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం పనులు వందశాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం 21జీపీల్లో వానపాములను ఉపయోగించి తడి,పొడి చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. మిగిలిన 8 పంచాయతీలకు వానపాములు అందుబాటులో లేనందున ఎరువుల తయారీని చేపట్టలేదు. వానపాములు రాగానే వాటిలో కంపోస్టు ఎరువును తయారు చేయిస్తాం. కంపోస్టు ఎరువును నర్సరీలకు, హరితహారం మొక్కలకు వినియోగిస్తున్నాం. ఎరువు ఎక్కువగా తయారైన గ్రామాల్లో రైతులకు విక్రయించి నిధులను పంచాయతీలకు సమకూరుస్తాం.

– అజార్ మొహియుద్దీన్, ఇటిక్యాల

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 149మంది విద్యార్థులకు గాను, 147మంది హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తనిఖీలో చీఫ్‌సూపరింటెండెంట్ వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ



గట్టు: గట్టులో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 268 మంది విద్యార్థులకు గాను, 264 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అధికారి కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీ విశ్వనాథ్‌లు తెలిపారు. ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి 60 మంది విద్యార్థులకు గాను, 54 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రం బయట ఎస్‌ఐ అయ్యన్న పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హరిహర కళాశాలలో..

అయిజ: ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ హరిహర కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహన కమిటీ సభ్యులు దేవేందర్ రెడ్డి, పద్మావతి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో మొత్తం 178 మంది పరీక్షకు హాజరు కావల్సి ఉండగా, 168 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా సంబరాలు చేసుకోవాలి



గట్టులో రంగులు చల్లుకున్న అంగన్‌వాడీ చిన్నారులు



నందిన్నెలో హోలీ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజోళి: హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. ప్రధానంగా యువత అత్యుత్సాహంతో చేసే కొన్ని చిన్న పొరపాట్ల వల్ల ఇతరుల జీవితాల్లో చెరగని గాయాలు పడతాయని, మంచి జరగాలనే సంకల్పంతో పండుగ నిర్వహించాలన్నారు. ఎక్కువగా కెమికల్స్ ఉన్న రంగులు వాడి అనారోగ్యం బారిన పడొద్దన్నారు. ఆకతాయిలు మద్యం తాగి రోడ్లపై ఇతరులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని అన్నారు. సంతోషకరమైన వాతావరణంలో సంబరాలు చేసుకోవాలన్నారు.

గట్టులో చిన్నారుల హోలీ వేడుకలు

గట్టు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ చిన్నారులు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా హోళి పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, సర్వసతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా వేడుకలు

ధరూరు: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసు కుని సంబరం చేసుకున్నారు. అన్ని వర్గాలు, చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆడుకునే ఏకైక రంగుల పండుగ హోలీ అని పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి వివరించారు. హోళిని ఘర్షణలకు, వివాదాలకు తావు లేకుండా జరుపుకోవాలని కోరారు.

ముందస్తుగా సంబరాలు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె ప్రైవేట్ పాఠశాలలో చిన్నారులు, ఉపాధ్యాయులు హోలీ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



అయిజ: పదో తరగతి పరీక్షలు నిర్వహించే పరీక్ష కేంద్రాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని ఎంఈఓ రాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సీఎస్, డీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. మండల కేంద్రంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారని, వాటికి అన్ని కరకాల ఫర్నీచర్‌తో పాటు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో 6మంది సీఎస్‌లు, 6మంది డీఓలు పాల్గొన్నారు.

ఏడుగురు లెక్చరర్స్‌కు నియామక పత్రాలు




మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 7మంది కొత్త లెక్చరర్స్‌కు జిల్లా నోడల్ అధికారి హృదయరాజ్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు విధుల్లోకి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ పద్మావతి పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ పెద్ద మజీద్‌లో ముస్లింలకు గురువారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. స్థానిక డ్రైవర్స్ యూనియన్ వారు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు విందు ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డ్రైవర్స్ రహమాన్, మున్న, షఫీ, మహిబూబ్, చాంద్, ఖాజా పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్ల పంపిణీ



అయిజ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు వీరేష్, గోపాల్, మాధవ్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మానవపాడు: అనుమతి లేకుండా టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా మానవపాడు శివారుప్రాంతంలో పట్టుకున్నామని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. గురువారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కర్నూల్ జిల్లా తుంగభద్ర నది నుంచి ఇసుక లోడ్‌తో కోదండదాపురం వెళ్తున్న టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో గ్రామంలో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పటిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను భక్తులు రథంపై ఊరేగించారు. స్వామివారి కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ, అన్న ప్రసాదాలు అందజేశారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



ఇందువాసిలో సీసీ రోడ్డు పనులకు భూమి చేస్తున్న నాయకులు

గట్టు: మండలంలోని ఇందువాసి గ్రామంలో చే పట్టిన సీసీ రోడ్డు పనులకు గురువారం జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్‌లు భూమి పూజ నిర్వహించారు. ఇందువాసి గ్రామంలోని ఇంజమ్మ దేవాలయం నుంచి గుట్ట కింద వరకు సీసీ రోడ్డుకు రూ.40 లక్షలు మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపా రు. కాంట్రాక్టర్ త్వరగా పనులు చేపట్టి, పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో మాజీ స ర్పంచ్ దుల్లయ్య, మాజీ ఉపసర్పంచు తిమ్మప్ప, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌గౌడ్, నాయకులు బస్వరాజుగౌడ్, వీరేష్‌గౌడ్, మునెప్ప, రమేష్, నర్సింహులు, మైబు, ఖాజా, గురుపాద, రాముడు, బోడెన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణారెడ్డి

ధరూరు: ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వియోగం చేసుకోవాలని ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జోగిని వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు, ఒకేషనల్ ట్రైనింగ్, సుకన్య సమృద్ధి యోజన, విశ్వకర్మ యోజన తదితర పథకాలపై కో ఆర్డినేటర్ నారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ వర్కర్లు, గోవిందమ్మ, నాగేంద్రమ్మ, రేవతి, ప్రమీల, అనిత, వరలక్ష్మి, అంజనమ్మ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఎంఏఓ



పులికల్ శివారులో వరిపంటను పరిశీలిస్తున్న ఎంఏఓ జనార్దన్

అయిజ: జిల్లా అధికారుల సూచన మేరకు మండల వ్యవసాయ అధికారి జనార్దన్ గురువారం మండలంలోని పులికల్, మేడికొండ, గ్రామ శివారులో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడారు. మండలంలో ఆర్డీఎస్ ఆయకట్టు కింది యాసంగి సీజన్‌లో 9వేల ఎకరాలు వరి సాగు చేశారని తెలిపారు. సుమారు సగభాగం పులికల్, కిసాన్‌నగర్, మేడికొండ శివార్లలోనే సాగుచేశారన్నారు. సాగు చేసిన వరిపంట పూర్తి కావడానికి ఇంకా రెండు తడులు నీరు పెట్టాల్సి ఉంటుందని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివకుమార్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అర్హులకు మాత్రమే రుణాలు



ఇటిక్యాలలో దివ్యాంగుల పత్రాలను పరిశీలిస్తున్న సీడీపీఓ సుజాత

ఇటిక్యాల: అర్హులైన దివ్యాంగులకు మాత్రమే ప్రభుత్వ రుణాలు అందుతాయని సీడీపీఓ సుజాత అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల వివరాలను పరిశీలించారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 58 మంది దివ్యాంగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు 51మంది దివ్యాంగులు హాజరు కాగా, 7గురు గైర్హాజరైనట్లు ఆమె పెర్కొన్నారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన తుమ్మిళ్ల యువకుడు



రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామానికి చెందిన యువకుడు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. తుమ్మిళ్లకు చెందిన సుంకన్న,పార్వతమ్మల కుమారుడు ఎస్. సుధాకర్ విద్యలో తన సత్తా చాటి గతంలో మూడు ఉద్యోగాలతో పాటు, బుధవారం ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో బోటనీ విభాగంలో ర్యాంక్ సాధించి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తున్నప్పటికీ సుధాకర్ చదువుకునేందుకు మంచి సహాయ సహకారాలు అందచేశారు. వివిధ కాంపిటీటివ్ పరీక్షలు ప్రిపేర్ అవుతున్న సమయంలో 2024లో గురుకుల ఉద్యోగాలలో మూడు ఉద్యోగాలకు ఎంపిక అయ్యాడు. టీజీటీ బయో సైన్స్, టీజీటీ జనరల్ సైన్స్, గురుకుల లెక్చరర్‌గా ఉద్యోగాలు సాధించిన ఆయన గురుకుల లెక్చరర్‌గా కేటీదొడ్డిలో గా విధులు నిర్వహిస్తున్నాడు. తాజాగా బుధవారం ప్రకటించిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. మల్దకల్‌లో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించి ప్రభుత్వం నుంచి ఆర్డర్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా తనకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. యువకుడి విజయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టైరు పేలి బొలెరో వాహనం బోల్తా



బోల్తా పడిన బొలెరో వాహనం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై టైరు పేలి బొలెరో బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లాకు చెందిన రాజు బొలెరో వాహనంలో అరటి గెలల లోడ్‌తో జడ్చర్లకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై మునగాల శివారులోకి రాగానే ఒక్కసారిగా టైరు పేలడంతో అదుపుతప్పి రోడ్డుపై పల్టీ కొడుతూ బోల్తా పడింది. ఇట్టి ప్రమాదంలో బొలెరో డ్రైవర్ రాజు తేలికపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు రాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది క్రేన్ సహాయంతో బొలెరోను అక్కడి నుంచి తొలగించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక



కేటీదొడ్డి: తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ కోసం జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇండోర్ స్టేడియంలో కేటీదొడ్డి మండలానికి చెందిన నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పవిత్ర, రేవతి, వెన్నెల, శైలజ, మనీషా, మహేశ్వరి, భరత్‌లు ఎంపికైనట్లు పీఈటీ అమ్రేష్ గౌడు గురువారం తెలిపారు. మార్చి 23న రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని వారు తెలిపారు.